# ఎవడబ్బసొమ్ము?

-ఆచంట హైమవతి

పార్క్ రెండో గేటు సమీపంలో మనోహర్ ఇంకెవరితోనో వాదం వేసుకున్నాడు. నా వేగంలో నేను ఆ జాగాని సమీపిస్తుండగా వద్దనుకున్నా ఆ సంభాషణ నా చెవిలో పడక మానటంలేదు. విసుగ్గా అన్పించి ఆ దగ్గర్లోనే ఉన్న ఇంకొక దారిగుండా వెనక్కి తిరిగి నడవసాగాను.

అప్రయత్నంగా మనోహర్ నాతో వాదం వేసుకున్న విషయం గుర్తొచ్చింది. అప్పటి సంగతులు పునశ్చరణ చేసుకుంటూ నడుస్తున్నాను.

నా కొలీగ్ డాక్టరు దగ్గరకెడ్తూ తోడుగా రమ్మంటే వెళ్ళాను. అతడిని పరీక్షించి, కొన్ని టెస్ట్‌లకు వ్రాసిచ్చాడు డాక్టరు. స్వతహాగా భయస్తుడైన నా కొలీగ్‌కి ధైర్యం చెప్పి, టెస్ట్‌లన్నింటినీ దగ్గరుండి చేయించాను. రిపోర్ట్‌లన్నీ పట్టుకెళ్ళి డాక్టరుకి చూపితే కొలెస్ట్రాల్, షుగర్ వగైరాలున్నాయనీ... పత్యం, మందులతో బాటుగా ఉదయపు నడక అవసరం అనీ చెప్పాడు.

నా కొలీగ్ స్థితి చూశాక ఎందుకైనా మంచిదని నేను కూడా అన్ని టెస్ట్‌లూ చేయించుకున్నాను. నాకన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. కాని.. ఇంకొక నాలుగేళ్ళలో నేను కూడా ఆ వయస్సుకి చేరబోతున్నాను గదా! అని.. మందులు తప్ప నా కొలీగ్‌కి డాక్టరు చెప్పినవన్నీ నేను కూడా పాటించసాగాను. పాటించ తగినవే గదా!

వాటిలో మొదటగా నేను అలవరుచుకున్నది ఉదయపు నడక. మా ఇంటికి ముప్పావు మైలు దూరంలో ఉన్న పార్క్‌లో బాగా నడుస్తూంటాను. రెండు వారాలు గడిచాయి. ఒకరోజున ఒకతను నా వెనకాలే వచ్చి "మీరు దారికడ్డంగా నడుస్తున్నారు. ఒకవైపుగా నడవండి. మీ వెనకాల వచ్చేవాళ్ళకి మీరు అడ్డంకదా?" అన్నాడు.

నేను దారికడ్డంగా నడవటం లేదు. ఒక పక్కగానే నడుస్తున్నాను. అయితే.. దారిలో వాననీరు పోయేందుకు చేసిన చిన్న పల్లం ఉండటం వల్ల, అందులో పడి కాలు బెసుకుతుందేమోనని కొంచెం పక్కకి అడుగేశాను. ఆ పల్లం దాటితే మళ్ళీ ఒక వారగానే నడవచ్చు. ఆ పల్లం దగ్గరకి వచ్చేసరికి పడకుండా జాగ్రత్తపడటానికి అందరూ అలాగే చేయటం నేను రోజూ చూస్తున్నదే!

"ఈ మూడు, నాలుగు అడుగుల గురించి అతడెందుకిలా విమర్శిస్తున్నాడు? తప్పుపట్టాలనే దృష్టితో అంటున్నాడంతే!" అన్పించింది. అయినా మర్యాదని అతిక్రమించటం నా పద్ధతికి విరుద్ధం. అందుకే- "సారీ!.." అని చెప్పి పక్కకి తొలగి చేతితో అతనికి ముందున్న దారివైపు చూపించాను. నేను సారీ చెప్పగానే అతడి అహం తృప్తిపడినట్లుంది. "దట్స్ గుడ్" అని చెప్పి నెత్తిమీద టోపీ సవరించుకుంటూ ముందుకి సాగిపోయాడు.

❍ ❍ ❍

పార్క్‌లో ఇంచుమించు అందరూ ఒకర్ని ఒకరు చూపుల ద్వారానో, మాటల ద్వారానో, చిరునవ్వుల ద్వారానో పలకరించుకుంటూండటం లాంటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటోంది. ఇంట్లోనే ఏదో ఒక వ్యాయామం చేసుకోవచ్చును గాని, ఈ ఆహ్లాదకర వాతావరణం ఎలా అనుభవమౌతుంది? నిత్యం దొరికే స్నేహ మాధుర్యం ఎలా దొరుకుతుంది?

ఆవేళ జలుబు, దగ్గులతో అలసటగా ఉండి.. రెండు రౌండ్లు తిరిగి దారి పక్కనున్న రాతి సోఫాలో కూర్చుండి పోయాను. పది, పదిహేను అడుగుల దూరంలో పూర్వం నా నడకను గురించి హెచ్చరించిన వ్యక్తి ఇంకొక ఆమెతో "దారంతా మీరే నడిస్తే వెనకాల వచ్చేవాళ్ళు వెనుతిరిగి పోవాలా?" అని వాదిస్తున్నాడు.

ఆమె "లేదండీ! నేను అలా నడవటం లేదు. తొందరగా నడుస్తున్నాను గదా! ముందు నడుస్తున్న వారిని దాటాలని నేను దారి మధ్యకి రావాల్సి వచ్చింది గాని.. నేనెప్పుడూ కుడిచేతి ప్రక్కనే నడుస్తుంటాను" ఖిన్నురాలై మొహమాటపడిపోతూ తనని తాను సమర్థించుకుంటోందామె.

"అయ్యో పాపం! ఆ మనోహర్ గాడి దృష్టి ఇవేళ ఈవిడ మీద పడిందా?.. ఇవేళంతా బాధపడేలాగ ఆవిడ మూడ్ పాడుచేసేదాకా వాడు తృప్తిపడడు." నన్ను దాటిపోతున్న ఇద్దరు అనుకోవటం విన్న నాకు తెలిసింది అతడి పేరు మనోహర్ అని.

ఎంత విచిత్రం! మనోహర్ అనే పేరు ఎంత మనోహరంగా ఉంది? కాని ఇతడు అందరికీ మనోవ్యధ పుట్టిస్తున్నాడు. అదే.. మనోహర్... అంటే మనశ్శాంతి హరించేస్తున్నాడు! అనుకుంటూ గేటు వైపు

చూసిన నాకు ఆవిడ పార్క్ నుంచి బయటకి వెళ్ళిపోవటం కనిపించింది.

ఆ తర్వాత నాలుగు రోజులు ఆవిడ పార్కులో కనిపించలేదు. "పాపం! ఇతడి మాటలకి బాగా ఫీలై ఉంటుంది. అరే... ఇతడిల్లు మా ఇంటికి దగ్గర్లోనే అన్నమాట!" నా ముందు నడుస్తున్న మనోహర్‌ని చూసి ఆశ్చర్యపడ్డాను. రెండడుగులు వేసి అతడిని పలకరించవచ్చును. తరుచుగా ఎరిగున్నవాళ్ళని అలా పలకరించటం నాకలవాటే! కాని.. ఎందుకో మనోహర్ని పలకరించటానికి ఇష్టం కలగలేదు.

వెనక్కి తిరిగి చూశాడంటే రోడ్‌లో నడిచే నా నడకని తిరిగి విమర్శించి నా మూడ్ కూడా చెడగొడతాడో.. ఏమిటో! "నేలను పోయేదాన్ని నెత్తికి రాసుకోవటం ఎందుకు?" గప్‌చిప్‌గా పక్క సందులోకి మలుపు తిరిగేశాన్నేను అవసరం లేకపోయినా!

❍ ❍ ❍

వారం రోజుల్నుంచి మనోహర్ పార్కుకి రావటం లేదు. అతడిచేత విమర్శింపబడిన వాళ్ళకి నిశ్చింతగా ఉండి ఉంటుంది. అందరికీ చెడ్డవాడిగా పరిగణింపబడటం అతనికి ఆనందమా? ఏమిటీ ఖర్మ? అతడు ఆంతర్యంలో ఏమనుకుంటున్నాడు? అందర్నీ హడలకొట్టాలనీ, తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలని అతడి అభిప్రాయం అనిపిస్తుంది. చిన్ననాడు పెరిగిన తీరు, ఆనాటి వాతావరణ ప్రభావంతో కొందరు వింతగా తయారవుతారని చదివిన విషయం గుర్తొచ్చింది.

"ఏ పుట్టలో ఏ పాముందో?" అన్నట్లుగా ఏ మనిషి స్థితిగతులు ఎలాంటివో...? అనూహ్యం కదా! మనం ఎందర్నో గురించి ఏవేవో అభిప్రాయాలు ఏర్పరచుకుంటాం. అసలు సంగతులు ఎవరికి తెలుస్తాయి? ఎలా తెలుస్తాయి?

గేటు సమీపానికి వచ్చేసరికి నా గత స్మృతుల్లో జరిగిన రోజుల పునశ్చరణ పూర్తయి ప్రస్తుతానికి వచ్చిపడింది నా మనస్సివాళ.

నిదానంగా కష్టపడి నడుస్తూండే ఒక కుంటి మనిషి రోజూ ఆ పార్కులో కనిపిస్తూంటాడు. అందరం అతన్ని తప్పుకుపోతూ ఉంటాము. అతడు కూడా ఎవరికీ అడ్డం రాకుండా కొంతసేపు నిలిచి.. తిరిగి నడుస్తూ ఉంటాడు.

అంత అణకువగా ఉండే అతనితో మనోహర్ వాదం వేసుకోవటం నన్ను కలవర పరచింది. వీలైతే వాళ్ళకి సర్దిచెప్పవచ్చు.. అనుకుంటూ సమీపంలో రాతి బెంచి మీద చతికిలపడ్డాను.

సంభాషణ "ఎంజాయ్‌మెంటు"గా మారటంతో వింటూ కూర్చున్నాను.


"అవునయ్యా..! నా కాలెటు లాగితే అటు నడుస్తాను. ఏంటంట? నీ జబర్‌దస్తీ? నీకేమైంది.. నేనిలా నడిస్తే?"

"నీ ఇష్టమొచ్చినట్టు నడవటానికి ఇది రోడ్డు కాదు. పార్క్! ఓ పక్కకి ఒదిగి నడవాలిక్కడ తెలుసా?" ఎక్కిరింతగా అంటున్నాడు మనోహర్.

"ఎవరికి ఒదగాలయ్యా? నువ్వూ నడుస్తున్నావ్.. నేనూ నడుస్తున్నాను. ఇద్దరం ఒకటే ఈ పార్కుకి. నాలాటోడివే నువ్వూను." కుంటి అతను కొంచెం విసురుగా అన్నాడు. అతడు చాలా అభిమానవంతునిలా ఉన్నాడు.

"ఇద్దరం ఒకటెలాగవుతాం? నువ్వు నువ్వే – నేను నేనే! కుంటి కొక్కెరవి నువ్వు. నీతో నన్ను పోలుస్తావా?" ఉద్రేకంలో దురుసుగా నోరు జారాడు మనోహర్.

ఛాల్లేవయ్యా.. నాతో పోల్చకూడనంత గొప్పతనం



ఫోటో: ఎన్.విక్రమ్

తమలో నాకేం కనబడటం లేదు" హేళనగా అన్నాడు కుంటతను.

మనోహర్ కోపం తారస్థాయికి చేరుతూంటే ఉచితానుచితాలు మరచి మాట్లాడసాగాడు. "నడవటానికి ఆ కుంటి కాలైనా నిలవాలంటే రేపట్నుంచీ ఈ పార్కుకి రావద్దు. వచ్చావో.. జాగ్రత్త!"

మిడిసి పడుతున్నట్లు అరుస్తున్న మనోహర్ వాగ్వాదం ఇంకా.. ఎంత దూరం పోతుందోననే ఆందోళన అక్కడున్న అందర్లోనూ కలిగింది.

"రావద్దనటానికి నువ్వెవరవయ్యా...? ఈ పార్కు నీ బాబుదా ఏంటి? మహా ఎగిరెగిరి పడుతున్నావ్?" మరింత దూకుడుగా అన్నాడు కుంటతను కూడా.

"అవునయ్యా- నా బాబుదే! ఈ పార్కు నా బాబుదే! తెలిసిందిగా బయటికి నడు ముందు." ముందు వెనుకలు ఆలోచించకుండా శృతిమించి గట్టిగా అరవటం ఎక్కువ చేశాడు మనోహర్.

"ఏటేటీ ఈ పార్కు నీ బాబుదా? చాల్చాల్లేవయ్యా.. మహా చెప్పొచ్చావ్! ఇనండయ్యా.. ఈ పార్కంట ఈళ్ళ బాబుదంట...!" గెడ్డం కింద చెయ్యి పెట్టుకుని విడ్డూరం

## జీవితం

దివినీ, భువినీ ఏకం చేస్తూ
దిక్చక్ర రేఖ!
మనసుని మనసుని ముడివేస్తూ
మమతల వంతెన!
ఆ రేఖలు ఆనందరేఖలై
ఆ మమతలు మందారాలై
దిక్కుతోచని నిశీధిలోనైనా
దిశానిర్దేశం చేస్తాయి!
జీవితాన మరుమల్లెల
జల్లులు కురిపిస్తాయి.

ఆ రేఖ చెదిరితే
ఆ మమత వాడితే
సుషుప్తికీ, చైతన్యానికీ మధ్య
అతి సన్నని రేఖ తొలిగితే
జీవన వీణియపై
మ్రోగేను విషాదరాగం!

జీవితం సప్తవర్ణాల
సంగమ హేల!
తీపీ, చేదూ సుఖం దుఃఖం
అన్నీ అందులో అంతర్భాగాలే!
ఈ ఒడిదుడుకుల క్రమంలోనే
వుందేమో యీ అనంత జీవనయాత్ర!

**-వల్లూరుపల్లి లక్ష్మి**

వింటున్నట్లు అందరితో చెప్పసాగాడు. అతడంటున్న మాటలు వింటున్న జనం మారు మాట్లాడకుండా ఉండిపోయారు.

"నిజంగా నీ బాబే ఈ పార్కు పెట్టించినా.. అది కట్టించి జనాలకి అప్పగించాక- ఇక అంతే! అది ప్రజలదే అవుతుంది గాని నీ బాబుదీ.. నీదీ అవదు. కట్టించినోళ్ళ పేర్లు రాతి పలకలపై ఉంటాయి గాని మరోటి కాదు. ఇందులో తిరిగే ఓళ్ళందర్నీ అదలిస్తూ కూకుంటే జనాలూరుకోరు. నీకు తెలవదేమో! ఆ సంగత్తెలుసుకో! సంఘానికి ఏదో కొంచెం ఉపకారం చేసేవుగదానని సంఘంలో అందరూ నీకు సేవకులైపోరు" ఆగి కొంచెం ఊపిరి తీసుకున్నాడతను.

"నేను చాలా రోజుల్నుంచీ గమనిత్తానే ఉన్నాను. అందర్నీ అదలించటానికి కంకణం కట్టుకున్నోడిలా ఏంటి నీ గీర? మా అందర్లాగే నువ్వూ ఈ పార్కులో తిరగొచ్చు. దానికెవరూ అడ్డురారు. ఎవరూ నిన్ను నతాయించరు. నువ్వు మాత్రవే అవకాశం దొరికించుకుని లడాయ్ వేసుకుని అందర్నీ బాధిస్తున్నావ్!"

"సత్యంగా ఈ పార్కు నీ బాబుదో.. కాదో నాకు తెలవదు. అయినా కూడా వాళ్ళు చేసిన పుణ్యం నీ పొగరుబోతుతనంతో ఫలించకుండా పోయేలా ఉంది. నువ్వు ఉపకారం చెయ్యకపోయినా ఫరవాలేదుగాని, అందర్నీ బాధించి పాపం మూట కట్టుకోకు. నేనిపుడు చెప్పిందంతా వైరంతో చెప్పటంలేదు. తోటి మనిషిగా చెప్తున్నాను. గమనించుకో! మంచిగా ఉండు!" మనోహర్ రెండు-మూడు సార్లు మధ్యలో మాట్లాడబోయినా వినిపించుకోకుండా తను చెప్పదలచుకున్నది పూర్తిగా చెప్పేసి, నిదానంగా కుంటుకుంటూ గేటులోంచి బయటకి వెళ్ళిపోయాడతను.

చుట్టూ చేరి వింటున్న వాళ్ళందరి పెదవుల మీదా సన్నని చిరునవ్వు. తామెవరూ పన్నెత్తి చెప్పలేని విషయాలు అతి నిదానంగా ఉన్న ఆ కుంటతను స్పష్టంగా చెప్పేసే సరికి అందరికీ ఒకటే ఆశ్చర్యం! కుంటతను వెళ్ళిపోయాడు గాని, మిగతా వాళ్ళ ఎడ మనోహర్ ప్రవర్తన ఎలా ఉంటుందోనని కలవరపడిన వాళ్ళందరూ మరింత ఆశ్చర్యపడేలాగ మనోహర్ తలొంచుకుని అక్కడినుంచి నిశ్శబ్దంగా వెళ్ళిపోవటంతో తేలిగ్గా నిట్టూర్చారు.

మనోహర్ రేపు మళ్ళీ పార్కుకి వస్తాడా?.. ఏమో..!